RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 15 సంచిక : 199 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 21 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 2/-

## ఫస్ట్ హరీష్.. నెక్స్ట్ కేటీఆర్.. ఆ తర్వాత కేసీఆర్..

# వన్ బై వన్!

## రేవంత్ టార్గెట్ ఫిక్స్!!






హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి గులాబీ పార్టీ గద్దెలు మొత్తం కూలాలని ఇటీవల వ్యాఖ్యలు చేశారు. గులాబీ పార్టీని వంద మీటర్ల లోతులో పాతిపెట్టాలని పిలుపునిచ్చారు. ఆ వ్యాఖ్యలు ఏదో రాజకీయ వ్యవహారంలో చేసినవని అందరూ అనుకున్నారు. కానీ, ముఖ్యమంత్రి వ్యాఖ్యల వెనుక లోతైన వ్యవహారం ఉందని ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది. ఖమ్మం సభలో రేవంత్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. ఆ తర్వాత ఒక్కరోజు గ్యాప్ లోనే ఆ పరిణామాలు ఎలా ఉంటాయో గులాబీ పార్టీకి అర్థమైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మరోసారి ఆక్టివ్ అయింది. ఈసారి మాజీ మంత్రి హరీష్ రావుకు నోటీసులు జారీ చేసింది. మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఆయన విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. సోమవారం రాత్రి సీఆర్పీఎస్ సెక్షన్ 160 కింద ఆయనకు నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు అధికారులు ఎదుట హరీష్ రావు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఏసిపి వెంకటగిరి ఈ నోటీసులను హరీష్ రావుకు అందించారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ టాపింగ్ జరిగిందని పదేపదే రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. చివరికి కేసీఆర్ కుమార్తె కూడా ఫోన్ టాపింగ్ జరిగిందని చెబుతున్నారు. తన భర్త ఫోన్ ను కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గంగా వ్యవహరించారని కవిత ఆరోపించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఫోన్ టాపింగ్ వ్యవహారంపై వేగంగా అడుగులు వేస్తోంది. ఫోన్ టాపింగ్ వల్ల గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ప్రయోజనాలు పొందారు? నాటి ప్రభుత్వ పెద్దల కోసం పనిచేసిన వారు ఎలాంటి ఫలితాన్ని ఆశించారు? అనే విషయాలను బయట పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం కృషి చేస్తుంది. హరీష్ రావు కు సిట్ నోటీసు ఇవ్వడం సంచలనం కలిగించింది. ఈ కేసులో ముందుగా హరీష్ రావును, ఆ తర్వాత కేటీఆర్ ను, అనంతరం కేసీఆర్ ను విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం ఏం చేస్తుంది అనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే చాలామందిని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. విచారణలో సేకరించిన సమాచారం తర్వాత హరీష్ రావుకు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. హరీష్ రావును విచారించి స్టేట్మెంట్ రికార్డు చేస్తారని తెలుస్తోంది. గతంలోనే తనకు నోటీసులు అందుతాయని హరీష్ రావు చెప్పారు.. పంచాయతీ ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ కారు రేసులో కేటీఆర్ కు నోటీసులు ఇచ్చారని.. ఇప్పుడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో తనకు కూడా ఇస్తారని హరీష్ రావు చెప్పారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం ఉ ండదని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాత్రమే అది జరుగుతుందని హరీష్ రావు గతంలోనే వ్యాఖ్యానించారు.. ఇక ఈ వ్యవహారంలో ముందు నుంచి కూడా కేసీఆర్ పేరు వినిపిస్తోంది. త్వరలోనే ఆయనను విచారిస్తారని.. దానికంటే ముందు నోటీసులు పంపిస్తారని ప్రచారం జరుగుతోంది.



## సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి భేటీ..

### పలు కీలక అంశాలపై చర్చ..

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో యూఏఈ మంత్రి దావోస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తామని యూఏఈ మంత్రి తెలిపారు. నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ.. తెలంగాణ లక్ష్యమని వ్యాఖ్యానించారు. యూఏఈ- తెలంగాణ సంయుక్త టాస్క్?ఫోర్స్ ప్రతిపాదన చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ..** దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజు బిజీబిజీగా ఉంది. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ చైర్మన్ అలోన్ స్టోపెల్‌తో సీఎం భేటీ అయ్యారు. సీఎంతో పాటూ మంత్రులు శ్రీధర్ బాబు , పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ ఇన్నోవేషన్?తో పాటు హెల్త్ టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఎరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్?లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

**తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు...** తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని గ్లోబల్ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా పదిశాతం లక్ష్యంగా విజన్ రోడ్‌మ్యాప్‌లో ఉందని తెలిపారు. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం- 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, సెమీకండక్టర్లు, ఏఐ, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.




హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సిట్ విచారణకు హాజరయ్యారు. కొద్దిసేపటి క్రితం జూబ్లీహిల్స్ పీఎస్‌కు ఆయన చేరుకున్నారు. హరీశ్‌రావు వెంట న్యాయవాదులను పీఎస్ లోపలికి పోలీసులు అనుమతించలేదు. పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని హరీశ్‌రావుకు సోమవారం సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన జిల్లా పర్యటనలో ఉండటంతో సిట్ సిబ్బంది నోటీసులను కోకాపేటలోని ఆయన ఇంట్లో ఇచ్చి వెళ్లారు. దాదాపు రెండేళ్లుగా జరుగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు, వ్యాపారులు మొదలు జడ్జీల ఫోన్లనూ ట్యాప్ చేశారని, వాటికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో 2024 మార్చిలో కేసు నమోదైంది.

అనంతరం జరిగిన పరిణామాల్లో ట్యాపింగ్ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు విదేశాలకు పారిపోవడంతో దర్యాప్తునకు ఆటంకం ఏర్పడింది. మిగతా నిందితులను అరెస్టు చేసినప్పటికీ ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో చాలాకాలంపాటు దర్యాప్తు నిలిచిపోయింది. గత జూన్?లో ప్రభాకర్‌రావు హైదరాబాద్ రావడంతో దర్యాప్తు ఊపందుకుంది.

## బడ్జెట్‌లో ఆదాయపు పన్నుపై గుడ్ న్యూస్ చెప్తారా ? ఉత్కంఠ..





ఈసారి కేంద్ర బడ్జెట్ కు గడువు దగ్గరపడుతోంది. పార్లమెంట్ లో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ పై ఇప్పటికే ఆర్థికమంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో ఈసారి కూడా ఆదాయపన్ను విషయంలోవేతన జీవులతో పాటు ఇతర వర్గాలు కూడా కేంద్రం వైపు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఈసారి ఆదాయపు పన్ను స్లాబ్ లలో ఉండబోయే మార్పులేంటి ?, ఇతర మార్పులేంటి, వీటి వల్ల తమకు ఏమైనా ప్రయోజనం ఉంటుందా లేదా అని వారు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి గతేడాది కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్నుకు సంబంధించి పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పన్ను చెల్లింపుకు కనీస ఆదాయంగా ఉన్న 7 లక్షల స్లాబ్ ను కాస్తా ఏకంగా 12 లక్షలకు పెంచేశారు. అలాగే స్లాబ్ లలోనూ పలు మార్పులు చేశారు. రిబేట్ లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తంగా పాత పన్ను విధానం కొనసాగిస్తూనే కొత్త పన్ను విధానం వైపు పన్ను చెల్లింపుదారుల్ని మళ్లించేందుకు ఏం చేయాలో నిర్మలా సీతారామన్ అంతా చేశారు. ఆ తర్వాత ఆదాయపు పన్ను చట్టంలోనూ సవరణలు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. దీంతో ఈసారి కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్ను చట్టం విషయంలో పెద్దగా మార్పులు, చేర్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఉన్నా పరిమితంగానే ఉంటాయని వారు భావిస్తున్నారు. డిమాండ్?కు సంబంధించిన డేటాలో కనిపిస్తున్నట్లుగా జీఎస్టీ స్లాబ్ ల క్రమబద్ధీకరణ వినియోగదారుల నమ్మకాన్ని పునరుద్ధరించిందని నిపుణులు భావిస్తున్నారు.ప్రభుత్వం ఈ ఊపును కొనసాగించాలని, విధానపరమైన అవాంతరాలను నివారించాలని వారు కోరుతున్నారు.



## భారత్ లక్ష్యంగా....

# పాకిస్తాన్ ఆర్మీ "రాకెట్ ఫోర్స్"!

ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్తాన్ భారత్‌ను ఎదుర్కొనే పనిలో పడింది. పహల్గామ్ దాడి తర్వాత, భారత్ జరిపిన ప్రతీకార చర్యలో పాకిస్తాన్ దారుణంగా భంగపడింది. 11 ఎయిర్ బేసులపై భారత్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇదే కాకుండా పీఓకే, పాకిస్తాన్ భూభాగాల్లో ఉన్న లష్కరేతోయిబా, జైషే మహ్మద్ ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో వందలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, ఈ దాడుల తర్వాత ఇప్పుడు పాకిస్తాన్ సైన్యం "రాకెట్ ఫోర్స్ కమాండ్" ఏర్పాటు చేయనుంది. పాక్ సైన్యం చీఫ్ అసిమ్ మునీర్ నేతృత్వంలో ఈ ఫోర్స్ రూపుదిద్దుకుంటున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. లాంగ్ రేంజ్ స్ట్రైక్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి దీనిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ డిఫెన్స్ ఫోర్సెస్ చీఫ్(సీడీఎఫ్) అసిమ్ మునీర్ అధ్యక్షతన ఇటీవల జరిగిన కార్ప్స్ కమాండర్ల సమావేశంలో ఈ రాకెట్ ఫోర్స్ కమాండ్‌కు ఆమోదం లభించింది. రాబోయే కొన్ని నెలల్లో దీనిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయబోతున్నారు. పాకిస్తాన్ రాకెట్ ఫోర్స్ కమాండ్, 2015లో చైనా స్థాపించిన రాకెట్ ఫోర్స్ ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. ఈ కమాండ్‌కు లెఫ్టినెంట్ జనరల్(త్రీస్టార్) లేదా మేజర్ జనరల్ (టూ స్టార్) హోదా కలిగిన సీనియర్ పాక్ ఆర్మీ అధికారి నాయకత్వం వహించే అవకాశం ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ప్రయోగించిన డ్రోన్లను, క్షిపణులు భారత ఎయిర్ డిఫెన్స్ సమర్థవంతంగా అడ్డుకుంది. ఇక భారత్ ప్రయోగించిన క్షిపణులను పాకిస్తాన్ వద్ద ఉన్న చైనీస్ డిఫెన్స్ నిలువరించలేకపోయింది. ఇదిలా ఉంటే, భారత్ కూడా శక్తివంతమైన రాకెట్ ఫోర్స్‌ను సృష్టించాలనుకుంటున్నట్లు సమాచారం. అయితే, అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. చైనా, పాక్ సరిహద్దుల్లో ఎదురవుతున్న భద్రతా సవాళ్ల దృష్ట్యా భారత్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ భారతదేశ సాయుధ దళాలను ఆధునీకరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. యుద్ధ స్వరూపం మారుతున్న నేపథ్యంలో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్ వంటి టెక్నాలజీతో సైన్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యాన్ని ఆయన వెల్లడించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## నక్క తోక తొక్కిన చైనా!

అన్ని రంగాల్లోనూ తనదైన శైలిలో దూసుకుపోతూ, అమెరికాకున్న అగ్రరాజ్యం అనే టైటిల్ కు ఎప్పుడు చెక్ పెట్టేద్దామా అన్నట్లుగా ఎదురు చూస్తోన్న డ్రాగన్ కంట్రీ చైనాకు ప్రకృతి ఓ గుడ్ న్యూస్ చెప్పింది! ఇందులో భాగంగా... చైనా తూర్పు లియానింగ్ ప్రావిన్స్ లో దేశ చరిత్రలోనే అతిపెద్ద బంగారు గని కనుగొనబడింది. దీంతో.. చైనా బంగారు నక్క తోక తొక్కిందా అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అవును... 1949 తర్వాత చైనాలో తాజాగా ఓ అతిపెద్ద బంగారు నిక్షేపం కనుగొనబడింది. గత ఏడాది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు కనుగొన్న గని కంటే ఇది చాలా పెద్దది. అది సుమారు 83 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దాచిపెట్టగా.. తాజా గనిలో సుమారు 1440 టన్నుల బంగారం నిల్వలున్నాయని.. దీని మొత్తం విలువ సుమారు 192 బిలియన్ డాలర్లు ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే... భారత కరెన్సీలో సుమారు 17,08,000 కోట్ల రూపాయలు అన్నమాట! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, శాటిలైట్స్, అత్యాధునిక టెక్నాలజీతో ఈ గనిని గుర్తించారు. దీనికి సంబంధించిన ప్రాజెక్టులో సుమారు వెయ్యి మంది ప్రభుత్వ ఉద్యోగులు సుమారు 15 నెలలపాటు అన్వేషించి, తవ్విన తర్వాత ఈ స్థాయిలో భారీ బంగారు గని బయటపడిందని చెబుతున్నారు. గతంలో బంగారు గని అభివృద్ధి భాగస్వామ్యాన్ని ఏర్పరచుకున్న తర్వాత.. చైనా నేషనల్ గోల్డ్ గ్రూప్, లియోనింగ్ మినరల్ జియాలజీ గ్రూప్, యింగ్ కౌ మునిసిపల్ ప్రభుత్వం.. తాజాగా ఓ భారీ పారిశ్రామిక సముదాయాన్ని నిర్మించడం ద్వారా స్థానిక బంగారు పరిశ్రమను ప్రోత్సహించడానికి సుమారు 2.82 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నాయి.

**బహుశా ఎప్పటినుంచో వెతుకుతున్న 'ఎల్ డోరాడో' ఇదే కావొచ్చు!:** ఈ సందర్భంగా స్పందించిన సీపీసీ షెన్యంగ్ మున్సిపల్ పార్టీ స్కూల్ ప్రొఫెసర్ వాంగ్ యాన్.. చైనా డైలీతో మాట్లాడుతూ.. ఈ గనిలోని వెయ్యి టన్నులకు పైగా నిల్వలు జాతీయ బంగారు వ్యూహాత్మక నిల్వలను గణనీయంగా భద్రపరుస్తాయని అన్నారు. ఇది ప్రపంచ మార్కెట్ లో దాని పోటీతత్వాన్ని మరింత పెంచుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే.. బహుశా మనం ఎప్పటినుంచో వెతుకున్న ఎల్ డొరాడో ఇదే కావొచ్చు అనే కామెంట్లు ఇప్పుడు చైనా నుంచి వినిపిస్తున్నాయి. కాగా.. ఎల్ డొరాడో అనేది ఒక పౌరాణిక నగరం! ఇది బంగారంతో నిండి ఉందని నమ్ముతారు. దీనికి స్పెయిన్ లోని పురాణగాథల నుంచి మూలాలు ఉన్నాయి.

## గ్రామసింహాల గాండ్రింపు.. ఏదీ తరలింపు?



హైదరాబాద్: వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలపై కుక్క కాటు ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అయినా జీహెచ్ఎంసీ స్పందించడం లేదు. మొక్కుబడి చర్యలు, కాకి లెక్కలతో కాలం గడుపుతోంది. రద్దీ ప్రాంతాల్లోని శునకాలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని సుప్రీంకోర్టు మూడు నెలల కిందట ఆదేశించినా.. బల్దియా అధికారులు కేవలం 2,700 వీధి కుక్కలను మాత్రమే పట్టుకొని సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు చెబుతున్నారు.

**ఇప్పుడు 8 లక్షలు..**

పాత జీహెచ్ఎంసీ పరిధిలో 4.5 లక్షల వీధి శునకాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఓఆర్ఆర్ వరకు విస్తరించడంతో 8 లక్షల వరకు ఉంటాయని అంచనా. ఇలాంటి పరిస్థితుల్లో.. కనీసం లక్ష శునకాలకైనా మెరుగైన వసతులతో ఆశ్రయం కల్పించే సంరక్షణ కేంద్రాలు అవసరం. పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఐదు జంతు సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2,500 శునకాలకు మాత్రమే వసతి సదుపాయం ఉంది. మరోవైపు కుక్కలను తరలించే చర్యలను పలు స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవో) అడ్డుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. కొత్త సంరక్షణ కేంద్రాలకు జోన్ల వారీగా స్థలాలను ఎంపిక చేయాలని గ్రేటర్ కమిషనర్ కర్ణన్ ఆరుగురు జడ్సీలను ఆదేశించగా.. కేవలం ఇద్దరు మాత్రమే స్థలాలను ఎంపిక చేశారు.

**కోర్టుకు చేరిన వీడియోలు..**

సుప్రీంకోర్టు ఆదేశాలంటూ జీహెచ్ఎంసీ వీధి కుక్కలను చంపుతోందని పలు ఎన్జీవోలు ఇప్పటికే కోర్టులను ఆశ్రయించాయి. తాజాగా ఓ స్వచ్ఛంద సంస్థ అంబర్‌పేట జంతు సంరక్షణ కేంద్రంలోని కళేబరాల వీడియోలను న్యాయస్థానానికి అందజేసింది. ఆ వీడియోలపై అధికారులు విచారణ జరిపారు. ఎన్జీవోల నుంచి డబ్బు తీసుకుని, తప్పుడు వీడియోలను వ్యాప్తి చేశారనే కారణంతో సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

## ఇసుక తరలుతోంది.. నీరు చేరనంది



రామడుగు: రామడుగు మండలంలోని మోతెవాగు ఇసుక అక్రమ రవాణాతో ఖాళీ అవుతోంది. పగటి వేళ నిఘా పెడుతున్నారని అక్రమ రవాణాదారులు రాత్రి దందా నడిపిస్తున్నారు. రామడుగు, షానగర్, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, రుద్రారం, కొక్కెరకుంట, వన్నారం గ్రామాలగుండా ఉన్న మోతె వాగులో ఇప్పటికే నాణ్యమైన ఇసుక ఖాళీ అయింది. నిత్యం వందలాది ట్రాక్టర్లలో అందినంత ఇసుక తవ్వుకోవడంతో మోతె వాగు గోతులను తలపిస్తోంది.

ప్రధానంగా రామడుగు, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, రుద్రారం, వన్నారం గ్రామాల నుంచి కరీంనగర్‌తోపాటు సమీప మండలాలకు ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లను అధికారులు పట్టుకోకుండా చరవాణిలో సమాచారాన్ని ముందస్తుగానే పంచుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అడ్డగోలు ఇసుక తవ్వకాలతో భూగర్భ జలమట్టం తగ్గిపోతుందని ఆవేదన చెందుతున్నారు.

**భూగర్భ జలాల కొరతతో..**

2022లో వరదలతో మండలంలోని చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. ఎనిమిది గ్రామాల రైతులకు చెందిన సుమారు 80 ఎకరాల పంట భూమి కోతకు గురైంది. ఇప్పుడు మోతెవాగుకు ఆనుకుని వందలాది ఎకరాల్లో పంటలు సాగు చేసుకుంటున్న రైతులు ఇసుక అక్రమ రవాణాతో భూగర్భ జలాల కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**'గుర్తింపు' ఉన్నవాటికే!**

ఇసుక అక్రమ రవాణా నిరోధించాలని అధికారులకు సమాచారం ఇచ్చినా ఫలితం ఉండటం లేదని రైతులు చెబుతున్నారు. ఇసుక అక్రమ రవాణా కోసం 'గుర్తింపు' కలిగిన ట్రాక్టర్లకు అనుమతి లభిస్తుందనే విమర్శ ఉంది. సదరు గుర్తింపు కలిగిన ట్రాక్టర్లకు ఎక్కడా తనిఖీ బెడద ఉండకపోవడంతో అక్రమ రవాణా సాఫీగా సాగుతోందని ఆరోపణలున్నాయి.

**ఇందిరమ్మ ఇళ్ల టోకెన్ లేని వాటిపై చర్యలు**

రామడుగు మండలం మోతె వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్లకు టోకెన్ కలిగిన వారు, ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతి కలిగిన వారికి మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంది. మిగతా వారికి ఇసుక తరలించే అనుమతి లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటాం. – కె.రాజు, ఎస్సై, రామడుగు

## కార్చిచ్చుల నుంచి కాపాడేదెలా?



సారంగాపూర్ : నిధుల కేటాయింపులు లేకపోవడం అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అడ్డంకిగా మారింది. అటవీ సంరక్షణకు ఏటా వేసవికి ముందు ఫైర్‌లైన్లు(అగ్గిరేఖలు) ఏర్పాటు చేస్తుంటారు. రెండు, మూడేళ్లుగా పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవటంతో ఏటా వాటిని తగ్గిస్తూ వస్తున్నారు. జంతువుల దాహార్తి తీర్చటం కోసం గతంలో అడవుల్లో ఏర్పాటు చేసిన నీటి కుండీలతోనే సరిపెడుతున్నారు. వాటిలో పంచాయతీ ట్రాక్టర్ల సహాయంతో నీటిని నింపుతున్నారు.

**554.91 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం**

జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, రాయికల్, కొడిమ్యాల, మెట్‌పల్లి అటవీ రేంజ్‌లు ఉన్నాయి. ఆయా రేంజ్ పరిధిలో 554.91 చదరపు కిలోమీటర్ల పొడవున అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రెండేళ్ల క్రితం వరకు జిల్లాలో దాదాపు 300 కిలోమీటర్ల వరకు అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్లు ఏర్పాటు చేసేవారు. టేకు వృక్షాలు ఉన్న ప్రాంతాల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే మళ్లీ ఆకులు రాలుతుండటంతో ఫైర్‌లైన్లు మళ్లీ ఏర్పాటు చేయాల్సి వచ్చేది. అయినా గతేడాది కేవలం 60 కిలోమీటర్ల మేర ఫైర్‌లైన్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం నిధుల సమస్యతో ఒక్కసారి కూడా ఏర్పాటు చేయటం ఇబ్బందిగా మారింది. అడవుల అభివృద్ధికి కంపా, తదితర నిధులతో ఏటా రూ.3 కోట్ల వరకు వివిధ అభివృద్ధి పనులు చేసేవారు.. ప్రస్తుతం అవి కూడా నిలిచిపోయాయి.

**50 ఫైర్‌లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

అయిదు రేంజ్‌ల పరిధిలో 50 కిలోమీటర్ల చొప్పున ఫైర్‌లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. రేంజ్‌కు ఒకటి లేదా రెండు అగ్గి ఆర్పే యంత్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రమాదాలను నిలువరించటం కష్టంగా మారడంతో జిల్లాలోని 24 సెక్షన్లకు ఒకటి చొప్పున అందించాలని అధికారులు నివేదించారు. కొంతకాలంగా పలు సెక్షన్లలో బీట్ అధికారుల ఖాళీలు భర్తీకి నోచుకోవటం లేదు. ఒక్కో బీట్ అధికారికి రెండుమూడు సెక్షన్లు ఉండడంతో అడవుల సంరక్షణ ఇబ్బందిగా మారింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో అత్యధికంగా టేకు వృక్షాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆకులు రాలుతున్నాయి. ఎక్కడా కొద్దిగా నిప్పు పడినా అడవంతా బూడిదవుతుంది. ముందస్తు చర్యలు చేపట్టినప్పుడే అడవుల సంరక్షణ సాధ్యమవుతోంది. **అవగాహన కల్పిస్తున్నాం**

అటవీ ప్రాంతాల సమీపంలోని గ్రామస్థులు, పశువుల కాపరులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. మంటలు అంటుకుంటే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. నిధుల సమస్యతో ఫైర్‌లైన్ల ఏర్పాటులో ఆలస్యం జరుగుతోంది. జిల్లాలో టేకు వృక్షాలు ఎక్కువగా ఉండటంతో ఆకులు రాలిపోయి వెంటనే మంటలు అంటుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక శాటిలైట్ నిఘా కేంద్రం ఏర్పాటు చేసి అడవుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. రవికుమార్, డిప్యూటీ రేంజర్

## పడకేసిన సుందరీకరణ.. రూ.కోటి చెరువుపాలు!

గోదావరిఖని : చెరువుల సుందరీకరణ పేరిట ప్రభుత్వం సుమారు తొమ్మిదేళ్ల కిందట రామగుండం నగరపాలక ప్రాంతంలో చేపట్టిన కార్యక్రమాన్ని నిధుల లేమితో నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు వెచ్చించిన సుమారు రూ.కోటి నిధులు చెరువులో పోసినట్లయింది. వివిధ కారణాలతో అంచనాలను సుమారు సగం వరకు తగ్గించి మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టగా.. నిధులు సరిపోకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. అభివృద్ధి పనులు పూర్తికాకపోవడం, పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడంతో చెరువు శిఖం ఆక్రమణలకు గురవుతుండటంతో పాటు కట్ట పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మిషన్ కాకతీయ–2లో భాగంగా నగరంలోని మల్కాపూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా సుందరీకరించాలనే సంకల్పంతో రూ.1.97 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. వివిధ కారణాలతో కేవలం రూ.1.01 కోట్లు మాత్రమే కేటాయించి చెరువు అభివృద్ధి పనులకు 2017 ఫిబ్రవరి 4న శంకుస్థాపన చేశారు. నిధులు సుమారు సగానికి తగ్గించడంతో అభివృద్ధి పనులను అర్ధాంతరంగానే నిలిపివేయాల్సి వచ్చింది. దీంతో అప్పటి వరకు చెరువు కట్ట అభివృద్ధి, బతుకమ్మఘాట్, మత్తడి పనులకు కేటాయించిన నిధులు వృథా అయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చెరువు మత్తడి నుంచి కట్ట మీదుగా శిఖం నుంచి తిరిగి మత్తడికి చేరుకునేలా వాకింగ్, సైక్లింగ్ ట్రాక్స్, గ్రిల్స్, రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం కట్టపైన మట్టిపోసి వదిలేశారు. శిఖంలో కనీసం మట్టి రోడ్డు సైతం వేయకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందనే



ఆరోపణలున్నాయి. కట్టపైన విద్యుత్తు దీపాలు, ఓపెన్ జిమ్, బెంచీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సప్తగిరి కాలనీ, ప్రశాంత్‌నగర్ కాలనీ నుంచి చెరువు కట్ట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

చెరువు కట్టమీదుగా గోదావరిఖని ప్రశాంత్‌నగర్, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు శ్రీనగర్ కాలనీ, మల్కాపూర్ వెళ్లేందుకు చాలా దగ్గరి దారి అయినప్పటికీ ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రామగుండం నగరపాలక ప్రాంత సుందరీకరణతో పాటు సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం మినీ ట్యాంకు బండ్ అభివృద్ధి పనులను పూర్తి చేసి నగర ప్రజలకు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


## ప్రయోగ పరీక్షలకు వేళాయె..!

నడిగూడెం : ఇంటర్ విద్యార్థులకు వార్షిక పరీక్షల ముందు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు సమయం ఆసన్నమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 21 నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. 21న ప్రథమ, 22న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ చదువుతున్న జనరల్, వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్షలు రాయాలి.

ఆంగ్లం సబ్జెక్ట్ 100 మార్కుల పేపర్‌లో 20 మార్కులు ప్రయోగ పరీక్ష, 80 మార్కులు థియరీ పరీక్షకు కేటాయించారు. విద్యార్థులకు ఆంగ్లంపై భయం పోయేలా, సులభంగా మార్కులు పొందేలా రెండేళ్ల క్రితం నుంచి ఆంగ్ల ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయోగ పరీక్షకు సంబంధించిన రికార్డులు సైతం విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. 23న బ్యాక్‌లాగ్ విద్యార్థులకు ఎథిక్స్ పరీక్ష, 24న ప్రథమ సంవత్సరం జనరల్, వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు పర్యావరణ విద్యపై వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. 100 మార్కులకుగాను విద్యార్థులు 60 మార్కులు రాత పరీక్ష, 40 మార్కులకు రికార్డు, ప్రాజెక్ట్ పని సంబంధించిన నోట్సులను పరీక్ష కేంద్రంలో అప్పగించాలి. ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు క్వాలిఫై అయితేనే వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫలితం ప్రకటిస్తారు.

**ఫిబ్రవరి 2 నుంచి..**

జనరల్ కోర్సులు చదువుతున్న ద్వితీయ సంవత్సరం సైన్సు విద్యార్థులు, వృత్తి విద్యాకోర్సులు చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం వారికి ఫిబ్రవరి 2 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు షెడ్యూలు ప్రకటించింది. మూడు విడతలుగా పరీక్షలు నిర్వహించేం



దుకు సన్నాహాలు చేశారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటల్లో పరీక్షలు జరుగుతాయి. వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఈసారి నిఘానీడలో ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు కసరత్తు చేసింది. ఈ మేరకు అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. **తప్పనిసరిగా హాజరు కావాలి:** డి.విజయనాయక్, ప్రిన్సిపల్, కేఎల్ఎన్ ప్రభుత్వ కళాశాల

ఆంగ్ల ప్రయోగ, పర్యావరణ విద్య పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలి. ఈ పరీక్షలు రాయకపోతే థియరీలో ఉత్తీర్ణులైనా ఫలితం వెలువడదు. ఇప్పటికే ఈ పరీక్షలకు సంబంధించిన రికార్డులను విద్యార్థులతో సంబంధిత అధ్యాపకుల పర్యవేక్షణలో సిద్ధం చేయాలని ఆదేశించాం. విద్యార్థులు సంసిద్ధంగా ఉండాలి.

# కూలీలు కావలెను!

నల్గొండ: యాసంగి సాగు జోరందుకున్న వేళ.. రైతులకు నాట్లు వేసేందుకు కూలీల కొరత ఏర్పడింది. డిసెంబరు రెండోవారం నుంచి నారుమళ్లు చల్లుకున్న వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ఒక్కరోజు ఒక్కో కూలీకి గరిష్ఠంగా రూ.800 వరకు చెల్లిస్తామని చెబుతున్నా.. దొరకని పరిస్థితి. ఒకవైపు నాగార్జునసార్, మూసీ, డిండి, ఎస్సారెస్పీ, ఇతరత్రా ప్రధాన జలాశయాలు, చెరువుల్లో సమృద్ధిగా నీటి వనరులున్నాయి. బోర్ల నిండా నీటి లభ్యత ఉంది. ఎటొచ్చి కూలీల కొరతే వేధిస్తుండటంతో రైతులు నాట్లు వేసే ప్రక్రియను వాయిదా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.15 లక్షల మంది రైతులు 12 లక్షల ఎకరాల్లో వరి, 2 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. యాసంగిలో గరిష్ఠంగా 2.5 లక్షల మంది రైతులు 11 లక్షల వరకు వరి సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

నల్గొండ, వేములపల్లి, నేరేడుచర్ల, కనగల్, హాలియా, రాజపేట, ఆలేరు, గరిడేపల్లి, తుంగతుర్తి ప్రాంతాల్లో ఎకరానికి గరిష్ఠంగా రూ.6వేల వరకు చెల్లిస్తామని, నాట్లు వేయమని పిలిచినా కూలీలు దొరకడం



లేదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌తో పాటు ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చే ఒడిశా, రాజస్థాన్ కూలీలతో నాట్లు వేయించాల్సిన పరిస్థితులున్నాయి. వారూ రానుపోనూ ప్రయాణ ఖర్చులు కూడా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు గంటకు రూ.1,800 వరకు వసూలు చేస్తున్నారు. ఎరువుల బస్తా రూ.1,450లకు, డీఏపీ, ఇతరత్రా కలుపు మందులు కలిపి మొత్తం రూ.1,900 వరకు ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

**సాగు ఖర్చుల భయంతో ప్రకృతి వ్యవసాయం**

రాంరెడ్డి, రైతు, చందనపల్లి

పెరిగిన సాగు పెట్టుబడి వ్యయంతో సేద్యం చేయడం ఇబ్బందికరంగా ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలు కూడా సకాలంలో దొరకడం లేదు. సీజన్‌లో ఒక్కో కూలీకి రూ.800 వరకు ఇస్తామని చెప్పినా రావడం లేదు. ఎకరానికి రూ.6వేలు వరకు ఖర్చవుతున్నాయి. యూరియా, పురుగు మందుల ఖర్చు భయంతో నాకున్న ఐదెకరాల పొలంలో కేవలం గోఆధారిత ప్రకృతి వ్యవసాయాన్ని కుటుంబంతోనే నాట్లు వేసుకుని సాగు చేసుకుంటున్నాం.

# అతివకు భరోసా

రాజపేట : అతివల భద్రతకు ప్రభుత్వం భరోసా కేంద్రాలు నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాలకు సైతం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. వేధింపులకు గురవుతున్న మహిళలు, బాలికల భద్రతకు జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్సీ) ఏర్పాటు చేయనున్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. తొలుత జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు మండలాలను ఎంపిక చేసి కార్యాచరణకు పూనుకుంది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో పోలీస్, మహిళా, శిశు సంక్షేమ, ఇతర శాఖలు జెండర్ రిసోర్స్ కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం కానున్నాయి.

**కార్యక్రమాలు ఇలా..** గ్రామస్థాయిలో ముగ్గురు, మండల స్థాయిలో ఐదుగురు సామాజిక కార్యాచరణ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రతి గురువారం జీఆర్సీ కేంద్రాల్లో కమిటీ సభ్యులు గృహహింస, లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, వరకట్న వేధింపులపై ఫిర్యాదులు స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో సామాజిక ఆర్థిక సమస్యల పరిష్కారం, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. షీ టీం, సఖి, బాలిక సాధికారత



కేంద్రాల సేవలు వివరిస్తారు. ఆడపిల్లలకు 21 ఏళ్లు నిండాకే వివాహం, బాలికలందరినీ చదివించడం, అంటరానితనం నిర్మూలించడం అనే అంశాలపై సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తారు.

బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు అరికట్టడం, తక్షణ పోలీస్ సహాయం, లైంగిక దాడి బాధితులకు వైద్యం, న్యాయం, పోలీసు సేవలను ఒకే చోట అందించనున్నారు.

బాధితులకు తక్షణ సాయం అందుతుంది

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ

మహిళల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జెండర్ రిసోర్స్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుంది. ముఖ్యంగా గృహహింస, లింగ వివక్ష, వేధింపులు, సామాజిక, ఆర్థిక సమస్యలకు సంబంధించి తక్షణ సాయం అందనుంది.

# కార్పొరేషన్‌లో ఖరారు!

నల్గొండ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పుర నుంచి మహానగరపాలక సంస్థగా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరగనున్నాయి. డివిజన్ల రిజర్వేషన్లను ఎస్టీ, ఎస్సీలకు జనాభా సంఖ్య, బీసీలకు కుల గణనను పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లు నిర్ణయించినట్లు సమాచారం. ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్లను కలెక్టర్ ఆధ్వర్యంలో డివిజన్ల వారీగా రిజర్వేషన్లు నిర్ణయించినట్లు తెలిసింది. రాజకీయనాయకుల మధ్య మహిళలకు దక్కాల్సిన డివిజన్లకు శనివారం డ్రా పద్ధతిలో కేటాయించి అధికారికంగా విడుదల చేసే అవకాశముంది. తెలిసిన రిజర్వేషన్లు ఖరారు కానుండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

# అక్రమాలు నిజమే.. కాదంటే గ్యాసే



మూసాపేట : చమురు సంస్థలు సరఫరా చేసే గ్యాస్ రెండు రకాలు. ఒకటి గృహ అవసరాలకు.. మరొకటి వాణిజ్య అవసరాలకు. దీన్ని ఎవరు అతిక్రమించినా చట్టరీత్యా బాధ్యులవుతారు. అయినా పలు గ్యాస్ సంస్థలకు చెందిన సిబ్బంది వ్యాపారులతో కుమ్మక్కై వంటగ్యాస్ సిలిండర్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా సాగుతున్న ఈ వ్యవహారంలో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఆయా సందర్భాల్లో విలువైన ఆస్తినష్టంతో పాటు కొన్నిసార్లు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి. ఈ నెల 13న కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీకాలనీ మూడో ఫేజ్‌లో వేర్వేరుగా జరిగిన ఘటనల్లో భారీగా ఆస్తినష్టం సంభవించింది. ఈ రెండు చోట్లా గ్యాస్ రీఫిల్లింగ్ చేసే క్రమంలో జరగడం గమనార్హం.

**డెలివరీ బాయ్స్ దందాతో.**

చమురు సంస్థలకు సంబంధించిన గ్యాస్ ఏజెన్సీల నుంచి గృహ అవసరాలు, వాణిజ్య విభాగం సిలిండర్లు బయటకు రావాలంటే డెలివరీ బాయ్స్ (సరఫరా సిబ్బంది)ది కీలకపాత్ర. తమ వద్దకు వచ్చే సిలిండర్లను వినియోగదారులకు అందించకుండా అక్రమదందాకు తెరలేపుతున్నారు. సాధారణంగా గ్యాస్ ఏజెన్సీల్లో 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండరుకు రూ.905లు తీసుకుంటారు. ఇందులోంచే డెలివరీ బాయ్స్‌కు రూ.18లు చెల్లిస్తారు. ఇది చాలదన్నట్లు వినియోగదారుల వద్దా వారు అదనంగా డబ్బులు తీసుకుంటుంటారు. ఇంకా ఒక్కో సిలిండరును రూ.1,500 నుంచి రూ.2 వేల దాకా హెటళ్లు, ఇతర వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమర్షియల్ సిలిండర్లను అందజేస్తోంది. 19 కిలోల సిలిండర్‌కు రూ.1,920లుగా నిర్ణయించారు. తక్కువధరకు వస్తున్నాయనే కారణంతో డెలివరీ బాయ్స్‌తో కుమ్మక్కవుతున్న కొందరు వ్యాపారులు గృహ అవసరాలకు వినియోగిస్తున్న సిలిండర్లను వాడుతున్నారు.

**కొంప ముంచుతున్న రీ ఫిల్లింగ్**

కొందరు దుకాణదారులు అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్‌కు పాల్పడుతున్నారు. డెలివరీ బాయ్స్ నుంచి కొనుగోలు సిలిండర్లలో ఒక్కో దాని నుంచి మూడు, నాలుగు చిన్న సిలిండర్లలోకి నింపి మార్కెట్‌లో రూ.500-రూ.750ల దాకా విక్రయిస్తున్నారు. తద్వారా వారికి రెండుమూడురెట్లకు పైగా ఆదాయం వస్తుంది. గ్యాస్ కనెక్షన్లు లేని నివాసితులు, పేదలు ఈ తరహా సిలిండర్లను నింపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు రీఫిల్లింగ్ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రశాంత్‌నగర్ ఘటనలో దుకాణంలో నిల్వ ఉంచిన 12 సిలిండర్లు బాంబుల తరహాలో వరుసగా పేలడం గమనార్హం.

# అనుమతుల్లో వేగం.. అభివృద్ధికి పునరుజ్జీవం



హైదరాబాద్: నగరంలో అభివృద్ధి పనులు పట్టాలెక్కే సమయం వచ్చింది. ఏళ్ల తరబడి భూసేకరణ వద్ద నిలిచిపోయిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణ పనులు త్వరలో వేగం పుంజుకోనున్నాయి. మూసీ పునరుజ్జీవ పనులకూ మార్గం సుగమమైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ అనుమతుల నిబంధనలను సవరిస్తూ.. టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్)కు డిమాండ్ పెంచుతూ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుతో.. ఆయా ప్రయోజనాలు కలగనున్నట్లు అధికార యంత్రాంగం ధీమా వ్యక్తం చేస్తోంది.

**నిధుల సమస్య నుంచి ఉపశమనం..** హెచ్-సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టదలచిన రోడ్డు విస్తరణ, పైవంతెనల నిర్మాణం కోసం, వ్యూహాత్మక నాలాల అభివృద్ధి (ఎస్‌ఎన్‌డీపీ) కింద వరద నాలాల విస్తరణ పనుల కోసం భూసేకరణ ప్రతిపాదనలూ సర్కారు వద్ద ఉన్నాయి. వాటన్నింటికీ కలిపి రూ.1000 కోట్ల నిధులు అవసరం. భూసేకరణకు నగదు రూపంలో కాకుండా, అభివృద్ధి బదలాయింపు హక్కు (టీడీఆర్) ద్వారా పరిహారం చెల్లించే విధానం గ్రేటర్‌లో అమలవుతోంది. ఉదాహరణకు కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ బ్రిడ్జిల నిర్మాణం, ఉప్పల్ కూడలిలో పైవంతెనల నిర్మాణం, తదితర ప్రాజెక్టులు భూసేకరణ సమస్య వల్ల ముందుకు సాగట్లేదు. ప్రభుత్వం టీడీఆర్‌కు డిమాండ్ పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో.. భూ యజమానులు టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా పరిహారం తీసుకునేందుకు ముందుకొస్తారని, తద్వారా పనులు ముందుకుసాగుతాయని జీహెచ్‌ఎంసీ అంచనా వేస్తోంది.

**మూసీ నదికి అస్త్రం..** మూసీ నదిని అభివృద్ధి చేయాలంటే దాదాపు 3వేల ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే.. నగరంలో టీడీఆర్ వినియోగానికి డిమాండ్ పెంచుతున్నామని, మూసీకి అవసరమైన భూసేకరణకు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని ఈ నెల 14న జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, హైడ్రా, ఇతర శాఖల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

**ప్రస్తుతం 300 ఎకరాలకుపైగా..** 300ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్లో ఉన్నాయి. ఐదేళ్ల కిందట టీడీఆర్ ధర కనిష్ఠంగా 18శాతానికి పడిపోయింది. ప్రస్తుతం 50శాతానికి పెరిగింది. సర్కారు తీసుకొచ్చిన కొత్త నిబంధనతో.. టీడీఆర్ ధర, వినియోగం పెరుగుతుందని నగర ప్రణాళిక విభాగం పేర్కొంటుంది.

# రోడ్డు వేస్తాం.. తవ్వేస్తాం



హైదరాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఉప్పల్‌లోని సూర్యనగర్ కాలనీ. సరిగ్గా ఏడు నెలల కిందట కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు అదే రోడ్డును తవ్వుతున్నారు. ఇదేంటని అడిగితే.. పాత డ్రైనేజీ పైపులను తొలగించి.. కొత్తవి ఏర్పాటు చేస్తామని గుత్తేదారులు సమాధానమిస్తున్నారు. మురుగునీటి పైపులైను వేసి.. మొక్కుబడిగా సీసీ రోడ్డు వేస్తారు. రెండు నెలల్లో ఆ ప్రాంతం గుంతలుగామారుతుంది. మరో ఆర్నెల్లకు జీహెచ్‌ఎంసీ మళ్లీ రోడ్డు నిర్మిస్తుంది. ఇలా ప్రజా ధనాన్ని దోచేందుకు పలువురు ఇంజినీర్లు, గుత్తేదారులు కలిసి చేస్తోన్న దందా ఇది. ఒకే మ్యాన్‌హోల్, ఒకే రోడ్డుకు.. ఏడాది పొడవునా మరమ్మతులు చేస్తూ.. ఏటా రూ.200కోట్లకు పైగా నిధులను అవినీతి అధికారులు దారి మళ్లిస్తున్నారనే విమర్శలున్నాయి.

ముందస్తు వ్యూహమేనా? మేము రోడ్లు వేస్తుంటే జలమండలి అధికారులు తవ్వేస్తున్నారని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు.. వాళ్లు సమాచారం ఇవ్వకుండా రోడ్లు వేస్తారని జలమండలి ఇంజినీర్లు పరస్పరం విమర్శలు చేసుకుంటుంటారు. కానీ.. సదరు అధికారులు ముందస్తు వ్యూహంలో భాగంగానే విమర్శలు చేసుకుంటారని.. జలమండలి ఆఫీసు సమీపంలోని రోడ్ల దుస్థితే అందుకు నిదర్శనమని క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

ఇవిగో ఉదాహరణలు..బంజారాహిల్స్ రోడ్డు నం.7లో గతేడాది మేలో జీహెచ్‌ఎంసీ రోడ్డును తవ్వింది. భూగర్భ నాలా పొడవునా సీసీ రోడ్డు నిర్మించింది. ఆ రోడ్డును జలమండలి అధికారులు ఇప్పుడు తవ్వుతున్నారు. అమీర్‌పేట్ ప్రధాన రహదారి నుంచి ఎల్లారెడ్డి గూడకు ఆర్నెల్ల కిందట సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు.. ఆ రోడ్డులోని వరద నీటి మ్యాన్‌హోళ్ల మరమ్మతులకు రోడ్డును ఇష్టానుసారం తవ్వుతున్నారు.

అమీర్‌పేట్ ఎంసీహెచ్ మార్కెట్ రోడ్డును.. సగటున ఆర్నెల్లకోసారి నిర్మిస్తుంటారు. ఇప్పుడు నెల కిందట నిర్మించిన సీసీని కూడా తవ్వుతున్నారు. ఇలాంటివి నగరంలో అడుగడుగునా కనిపిస్తున్నాయి.

# రోగులు రెట్టింపు.. లేని పట్టింపు!

దేవరకొండ : దేవరకొండ డివిజన్‌లో స్థానికంగా ఉన్న ఏరియా ఆసుపత్రి అతిపెద్దది కావడంతో రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. సాధారణంగా ఓపీ 500 నుంచి 600 ఉండగా.. కొన్ని రోజుల్లో 800 నుంచి 1000 వరకు ఉంటుంది. దవాఖానాలో వైద్యులు రోగులకు రక్త, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి రాసి పంపుతారు. పరీక్షలు చేయించుకొని ఫలితాలు తీసుకొచ్చిన రోగి వైద్యుల కోసం వెతకాల్సిన వస్తోంది. రక్త పరీక్షల ఫలితాలు వచ్చే



సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతుంది. అప్పటికే వైద్యులు సమయం ముగిసిందని వెళ్లిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రామాలకు వెళ్లి తిరిగి మరుసటి రోజు పరీక్ష ఫలితాలను తీసుకొని సంబంధిత వైద్యున్ని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు రోగులు ఆ పరీక్ష ఫలితాలను తీసుకొని ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి, జేబులు ఖాళీ చేసుకునే దుస్థితి నెలకొంది. పీహెచ్‌సీల్లో సరైన పరికరాలు, నిపుణులు అందుబాటులో లేకపోవడంతో డివిజన్ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య పరీక్షలు అగ్ని పరీక్షగా మారాయి. అధికారుల తీరు మారాలని రోగులు వాపోతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రకాష్‌ను వివరణ కోరగా.. రక్త పరీక్షలు ముగించుకొని రిపోర్టును తీసుకొచ్చిన రోగి అత్యవసర వార్డులో ఉన్న వైద్యున్ని సంప్రదించి, మందులను తీసుకోవాలని, అత్యవసర విభాగంలో వైద్యుడు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# సెలవుల అదను.. అక్రమాలకు పదును

జిన్నారం: సంక్రాంతి పండగ సందర్భంగా వరుస సెలవులొచ్చాయి. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అక్రమార్కులు అదే అదనుగా భావించారు. ఏకంగా 50 వరకు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఐదారు రోజుల్లోనే ఇళ్లు వెలిశాయి. జిన్నారం మండలం ఖాజీపల్లి శివారు 174, 181 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న దందా ఇది. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక నేతలు వీరికే వంత పాడుతున్నారనే విమర్శలొస్తున్నాయి. తాజాగా ఖాజీచెరువు కట్టపైనా నిర్మాణాలు వెలుస్తున్నాయి.

**ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారు**

ఖాజీపల్లి శివారులో 174, 181 సర్వే నంబరులోని సుమారు రెండు ఎకరాల గుట్టను కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో చదును చేస్తున్నారు. ఇందులో కొంత రెవెన్యూ స్థలం, మరికొంత నీటిపారుదల శాఖకు చెందిన శిఖం, అటవీశాఖ స్థలాలు ఉన్నాయి. ఈ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. ఇక్కడ చిన్న ప్లాట్లుగా చేసి విక్రయిస్తుండగా.. నిర్మాణాలు వెలుస్తున్నాయి. వాటికి వెంటనే ఇంటి నంబర్లు కేటాయిస్తున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పార్కు జాగా పరాధీనం**

ఖాజీపల్లి గ్రామానికి ప్రత్యేకంగా గుట్టపై స్థలంలో పార్కు నిర్మించి బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని గత పంచాయతీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. కొంత మేరకు పనులు చేపట్టారు. ఈ స్థలం ఇప్పుడు పరాధీనమవుతూ.. ఇళ్లు వెలుస్తున్నా.. అడ్డుకునే వారే కరవయ్యారు.

**సమస్య మా దృష్టికి వచ్చింది**

ఖాజీపల్లి శివారులో అక్రమ నిర్మాణాల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత కబ్జాలను గుర్తించి చర్యలు తీసుకుంటాం. వరుస సెలవుల నేపథ్యంలో కొందరు అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించినట్లు తెలిసింది. దేవదాసు, తహసీల్దార్, జిన్నారం

# ఖజానాకు కన్నం.. విచారణ వేగవంతం

సంగారెడ్డి: వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ సొమ్మును దారి మళ్లించిన ఘటనలు జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో వెలుగుచూశాయి. ఈ తరహా అక్రమాలు ఉమ్మడి మెదక్ జిల్లాల్లోనూ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు సమగ్ర విచారణ చేస్తున్నారు. **ఎక్కడెక్కడ.. ఎలా..**

సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, కంది, సదాశివపేట, జిన్నారం మండలాల్లో జీపీఏ(జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ)లను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో నిర్దేశించిన మేర స్టాంపు డ్యూటీ (రుసుం) చెల్లించకుండా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు.

ఎంత మేర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారనే దానిపై ఆరా తీస్తున్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు జరిగిన జీపీఏల క్రమబద్ధీకరణలో అక్రమాలు జరిగినట్లుగా రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే కంది మండలంలో జరిగిన 86 జీపీఏలపై విచారణ ప్రారంభించి దస్త్రాలను పరిశీలిస్తున్నారు.

మండల రెవెన్యూ అధికారులు మాత్రం అన్నీ సక్రమంగానే ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. సీసీఎల్ఏ యంత్రాంగం మాత్రం నిర్దేశించిన మేర సొమ్ములు జమకాలేదని పేర్కొంటూ పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

రామచంద్రాపురం, గుమ్మడిదల మండలాల్లోనూ రిజిస్ట్రేషన్ రుసుంల చెల్లింపుల్లో కొంతమేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి.

**అక్రమాల పాత్రధారులపై కూడా**

నాలుగు మండలాల్లో జీపీఏలను రిజిస్ట్రేషన్ చేసే సమయంలో యజమానులు నిర్దేశిత రుసుం చెల్లించినప్పటికీ మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులు సాంకేతికత ఆధారంగా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు భావిస్తున్నారు. దీంతో అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది.

**తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ యంత్రాంగం ఆరా**

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 2018 నుంచి జరిగిన భూముల లావాదేవీలకు సంబంధించిన దస్త్రాల పరిశీలన చేపట్టే కార్యక్రమాన్ని సీసీఎల్ఏ(భూ పరిపాలన కమిషన్) ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం చేపట్టింది. దీంతో గత వారం రోజుల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ఐదేళ్లుగా భూముల రిజిస్ట్రేషన్లపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. జిన్నారం, గుమ్మడిదలతో పాటు అమీన్‌పూర్, రామచంద్రాపురం, సదాశివపేట మండలాల్లో ప్రభుత్వ భూములను సైతం బైనంబర్లతో రిజిస్ట్రేషన్లు పూర్తికానిచ్చినట్లు వెలుగులోకి వచ్చాయి. వీటికి సంబంధించి రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



## తప్పు చేయనప్పుడు భయమెందుకు?

# హరీశ్‌రావుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యే ముందు మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలపై కాంగ్రెస్ నేతలు స్పందించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్తది కాదని.. గత రెండేళ్లుగా దీనిపై విచారణ జరుగుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. హరీశ్‌రావు పోరాటయోధుడిలా ఫీలవుతున్నారని వ్యాఖ్యానించారు. పదేళ్లపాటు ఫోన్లు ట్యాప్ చేయించారని ఆరోపించారు. "ఇంటి అల్లుడి ఫోన్ ట్యాప్ చేశారని స్వయంగా కవిత వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల ముందు డ్రామా చేస్తున్నారని హరీశ్? బాధపడిపోతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని ఎలా వేధించారో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎన్నో కేసులు పెట్టి ఆయన్ను అణగదొక్కాలని చూశారు. సీఎంపై నోరు పారేసుకుంటే ఊరుకునేది లేదు" అని అయిలయ్య అన్నారు. హరీశ్‌రావుకు నిజాయతీ ఉంటే తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకోలేదని ప్రమాణం చేయగలరా? అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు. తప్పు చేయకపోతే ఇబ్బంది ఎందుకని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆయన బాధితుడైతే సంబంధిత వివరాలను సిట్?కు తెలపాలని.. బాధ్యుడైతే సమాధానం చెప్పాలని డిమాండ్? చేశారు. "అధికారులతో తప్పుడు పనులు చేయించి తెలంగాణను అభాసుపాల్జేశారు. కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారు. రాష్ట్రం ఆర్థికంగా విధ్వంసం కావడానికి కేసీఆర్ కారణం. మేం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ నేతలు బయట తిరగలేరు. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుంది"అని దయాకర్ అన్నారు. హరీశ్‌రావు సిట్ విచారణకు వస్తూ హడావుడి ఎందుకని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. ఫోన్? ట్యాపింగ్? కేసులో చాలా మంది ఇబ్బందిపడ్డారని చెప్పారు. తప్పు చేయనప్పుడు భయమెందుకన్నారు.



## గ్రీన్‌లాండ్‌కు అమెరికా యుద్ధవిమానం..!

గ్రీన్‌లాండ్ స్వాధీనం విషయంలో అమెరికా దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా ఆ ద్వీపంలోని కీలక సైనిక స్థావరం వద్ద యుద్ధ విమానాన్ని మోహరించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ చేసిన ప్రకటన ఆందోళన రేకెత్తిస్తోంది. అమెరికా, కెనడా సంయుక్త రక్షణ సంస్థ అయిన 'నార్త్ అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్' తాజాగా గ్రీన్?లాండ్?కు సంబంధించి తమ సోషల్? మీడియా ఖాతాలో ఓ పోస్ట్? చేసింది. త్వరలోనే తమ సైనిక విమానం పిటుఫిక్? స్పేస్ బేస్‌కు చేరుకుంటుందని అందులో వెల్లడించింది. ఈ ప్రాంతంలో రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన తమ దీర్ఘకాల ప్రణాళికల్లో భాగంగా ఈ మోహరింపు చేపట్టనున్నట్లు పేర్కొంది. కెనడా, డెన్మార్క్ రాజ్యం సమన్వయంతో ఈ కార్యకలాపాలు జరగనున్నాయని, గ్రీన్‌లాండ్ ప్రభుత్వానికి దీని గురించి ముందుగానే సమాచారం అందించామని నోరాడ్ తెలిపింది. అయితే దీనిపై డెన్మార్క్ నుంచి ఇంతవరకూ ఎలాంటి స్పందన రాలేదు. ఇక, అమెరికా దుందుడుకు చర్యల నేపథ్యంలో డెన్మార్క్ పెద్ద సంఖ్యలో అదనపు బలగాలను గ్రీన్‌లాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. బలగాలు, సైనిక పరికరాలను మోసుకెళ్లిన అనేక విమానాలు గ్రీన్‌లాండ్‌కు చేరుకున్నాయని పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాలతో గ్రీన్‌లాండ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ ఏ క్షణాన ఏ ప్రకటన చేస్తారో, ఏ చర్యలు తీసుకుంటారోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవాలనే అమెరికా ఆశలను ఉద్దేశిస్తూ.. ఫ్రాన్స్ బహిరంగ విమర్శలు చేసింది. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ ఎందుకు దృష్టిసారించారనే దానిపై అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భవిష్యత్తులో రష్యా నుంచి వచ్చే ముప్పు నుంచి కాపాడుకోవడంలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనిపై ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేసింది. 'ఏదోఒక రోజు మంటలు చెలరేగితే.. అగ్నిమాపక సిబ్బంది రావాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడే ఇంటిని తగలబెట్టేయడం మంచిది. ఏదో ఒకరోజు కారుకు ప్రమాదం జరిగితే నష్టం వాటిల్లుతుంది. కాబట్టి ఇప్పుడే కారుకు యాక్సిడెంట్ చేయడం మంచిది'' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరిందిఇక, గ్రీన్‌లాండ్ సాధించుకునేందుకు అగ్రరాజ్యం చేస్తున్న ప్రయత్నాలపై ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి రోలాండ్ లెస్కూర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాలు ఈయూ, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య, ఆర్థిక సంబంధాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.



## డైవర్షన్ కోసం రేవంత్ సిల్లీ డ్రామా

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు సిట్ నోటీసులు ఇచ్చారని.. సీఎం ఆడుతున్న సిల్లీ డ్రామా ఇది అని వ్యాఖ్యానించారు. సిట్ విచారణకు హాజరయ్యే ముందు కోకాపేటలో మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. "సోమవారం రాత్రి 9 గంటలకు నోటీసులు ఇచ్చి మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని సిట్ నోటీసులు ఇచ్చింది. చట్టాలపై గౌరవముంది.. పిలిచిన సమయానికి విచారణకు హాజరవుతా. నేను ఏ తప్పూ చేయలేదు.. భయపడను. రేవంత్? బామ్మర్ది బాగోతం, మున్సిపల్ ఎన్నికల ముందు అవినీతిని బయటపెట్టినందుకే నోటీసులు ఇచ్చారు. ఇలాంటివి నాకు కొత్త కాదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఎన్ని కేసులు పెట్టినా కేసీఆర్ నాయకత్వంలో పోరాడాం. ఆరు గ్యారంటీలు, ఇతర హామీల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం. బొగ్గు కుంభకోణం, వాటాల పంచాయతీ ప్రజలకు అర్థమైంది. వాటి నుంచి ప్రజలు, మీడియా దృష్టి మళ్లించేందుకే ఇలాంటి చర్యలు చేపట్టారు. పంచాయతీ ఎన్నికల్లో రేవంత్ అంచనాలు తప్పాయి. వారు ఊహించని స్థాయిలో బీఆర్ఎస్‌కు స్థానాలు వచ్చాయి. కృష్ణా నీటిని ఆంధ్రాకు అప్పగిస్తున్నారు. రెండేళ్ల నుంచి ఫోన్ ట్యాపింగ్‌పై డ్రామాలు ఆడుతున్నారు. గతంలో నాపై పెట్టిన కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు కొట్టేశాయి. న్యాయం మావైపు ఉంది. సుప్రీంకోర్టే కొట్టివేసిన తర్వాత మళ్లీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడమేంటి? ఎన్నిసార్లు పిలిచినా వస్తాం. అవినీతి బాగోతాలను బయటపెడుతూనే ఉంటాం" అని హరీశ్‌రావు అన్నారు.

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బహిరంగ లేఖ...** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వానికి సింగరేణిలో 49 శాతం వాటా ఉందని.. అక్కడ జరుగుతున్న అవినీతిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డితో కుమ్మక్కు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డిని కోరారు. అన్ని ఆధారాలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.



## చలాన్లపై కీలక ఆదేశాలు

వాహన చలాన్లపై ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది. వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్? పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

# ఫోన్ ట్యాపింగ్.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై ఎంపీ లక్ష్మణ్ విమర్శలు



న్యూఢిల్లీ, జనవరి 20: ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ అయిందని తెలంగాణ మొత్తం కోడై కూస్తోందని ఎంపీ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కవిత కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని.. ఈ విషయమై కవితే స్వయంగా చెప్పారన్నారు. ముందు.. కవిత మాటలకు బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్?కు పాల్పడుతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు ఎంపీ లక్ష్మణ్. వారి అంతర్గత కలహాలతో ఆయా నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. దర్యాప్తులతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న దోషులు, బాధ్యులు ఎవరో నిర్ధారించకుండా రెండేళ్లు పూర్తి చేశారంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్.. కలహాలతో ముక్కలైపోయిందని, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని లక్ష్మణ్ అన్నారు. కవిత ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కోల్ బ్లాక్‌పై న్యాయపోరాటం కూడా చేసే అవకాశముందని చెప్పారు. బీఆరచవతీతీచస్ తిన్న మొత్తాన్ని కక్కిస్తామని రేవంత్ రెడ్డి అన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ పూర్తి దర్యాప్తు చేయాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# ఈ నెల 24 లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్!




హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా కలెక్టర్లతో ఎస్ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు.

గురువారం ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు. ఈనెల 24న లేదా 27న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్, జనవరి 20: సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక ఆదేశాలు జారీ చేసింది. 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు హోం శాఖ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీవీ ఆనంద్??కు హైకోర్టు సుమోటో కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. గత ఆదేశాలను ధిక్కరిస్తూ మన శంకరవరప్రసాద్ గారు చిత్రానికి ధరలు పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ నంబర్ ఫ్రొ చీశీ.1518 శీట 2026పై అడ్వకేట్ విజయ్ గోపాల్ వాదనలు వినిపించారు.

హోంశాఖ అధికారులు గత ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారని వాదించారు. మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల రేట్లు పెంచిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టారంటూ పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ క్రమంలోనే సీవీ ఆనంద్‌కు హైకోర్టు కంటెంప్ట్ నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ సినిమాస్ రెగ్యులేషన్ యాక్ట్-1955 ప్రకారమే ధరల నిర్ణయాలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమాకైనా టికెట్ ధరల పెంపు నిర్ణయం తీసుకునేటప్పుడు 90 రోజుల ముందే ప్రకటించాలని హైకోర్టు ఆదేశించింది.

గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా మళ్లీ ఇలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది.

# బీఆర్ఎస్ నేతలను విచారణ చేయొద్దని చట్టం ఏమైనా ఉందా?: బల్మూరి వెంకట్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావును సిట్ విచారణకు పిలిస్తే.. తెలంగాణ జాతిపితలాగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఎద్దేవా చేశారు. గతంలో తన ఫోన్ ట్యాప్ అయ్యిందని.. తనను కూడా విచారణకు పిలిచినట్లు చెప్పారు. సీఎల్పీ మీడియా సెంటర్ వద్ద బల్మూరి వెంకట్ మాట్లాడారు. "నా కుటుంబ సభ్యులతోపాటు మా ఇంటి వాచ్?మెన్? ఫోన్?ను కూడా ట్యాప్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో అత్యధిక కేసులు పెట్టింది నా పైనే. గాంధీ భవన్ లోపలికి వచ్చి మరి అరెస్ట్ చేశారు. మా ఎమ్మెల్యేలను బెదిరించి మీ పార్టీలో చేర్చుకున్నారు. మా ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ ఆధారాలు చూపించాలి. మిమ్మల్ని విచారణ చేయవద్దని చట్టం ఏమైనా ఉందా?" అని బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.

# హరీశ్‌రావును జైలుకు పంపాలని తహతహలాడుతున్నారు.. రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జనవరి20 : సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్?కు నోటీసులు ఇచ్చినా భయపడేది లేదన్నారు. ఇంకో వెయ్యి సెట్?లు వేసినా ఎదుర్కోవటానికి రెడీగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే రేవంత్ రెడ్డిని వదిలేది లేదని హెచ్చరించారు. తెలంగాణ భవన్?లో మంగళవారం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావును జైలుకు పంపాలని రేవంత్?రెడ్డి తహతహలాడుతున్నారని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు కంటే రేవంత్‌రెడ్డి సిట్ పెద్దదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. బొగ్గు కుంభకోణంలో సీఎం బావమరిది సృజన్ రెడ్డి కింగ్ పిన్ అని ఆరోపణలు చేశారు. బొగ్గు కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**బొగ్గు కుంభకోణంలో కిషన్‌రెడ్డికి వాటాలు..** బొగ్గు కుంభకోణంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కూడా భాగస్వామ్యం ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కోల్ మినిస్టర్ కిషన్.. ఈ విషయంలో మౌనంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. రేవంత్‌రెడ్డి బావమరిది కుంభకోణం బయట పెట్టినందుకే హరీశ్‌రావును విచారణ పేరుతో వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లొసుగులు బయటపెట్టిన ప్రతిసారీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వాటాల పంచాయితీ వల్లే నైనీ బ్లాక్ టెండర్లను మల్లు భట్టి విక్రమార్క రద్దు చేశారని ఆరోపించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ పెద్ద తప్పు అని కేటీఆర్ తెలిపారు. టెండర్లు వేస్తోన్న వారిపై సృజ?న్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. నైనీ ఒక్కటే రద్దు చేస్తే సరిపోదని.. సృజన్ రెడ్డి దక్కించుకున్న టెండర్లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రేవంత్ కేబినెట్?ను హరీశ్?రావు ఫుట్?బాల్ ఆడుకున్నారని సెటైర్లు వేశారు.

**రేవంత్ రెడ్డిది బురద బుద్దే..** అదృష్టం అందలం ఎక్కిస్తే.. రేవంత్‌ది మాత్రం బురద బుద్ధేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నాళ్లు లీకుల మీద బతుకుతారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్? కేసుపై ఎందుకు ఒక్క అధికారిక ప్రెస్‌మీట్ పెట్టరని నిలదీశారు. విచారణ పేరుతో బీఆరచవతీతీచస్ నాయకత్వాన్ని రేవంత్ సర్కార్ వేధిస్తోందని విమర్శించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి కొడుకు భూ అరాచకాలపై సిట్ ఎందుకు వేయటం లేదని ఆయన ప్రశ్నించారు. ఏఐసీసీ సెక్రటరీ అలంపూర్‌లో రూ.8 కోట్లు డిమాండ్ చేస్తే.. ఎందుకు సిట్ వేయరు.? అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగస్వామ్యమైన అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని సూచించారు. రేపు అధికారంలోకి వచ్చేది బీఆరచవతీతీచస్సేనని.. రేవంత్?రెడ్డి ఆడే రాజకీయ క్రీడలో అధికారులు బలి కావొద్దని హితవు పలికారు.

**అధికారులను వదిలేది లేదు..** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణలో పాల్గొన్న అధికారులను రిటైర్ అయిన తర్వాత కూడా వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు. కేబినెట్?లో దండుపాళ్యం బ్యాచ్ ఉందని ఎద్దేవా చేశారు. దందాల నుంచి దృష్టి మరల్చడానికే సిట్ విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. బీఆరచవతీతీచస్ జెండా గద్దెలను ముట్టుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. పేమెంట్ కోటాలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని.. ఇంకా ఆయనను సీఎంగా గుర్తించటం లేదని సెటైర్లు వేశారు. హార్వర్డ్?లో చదువుకున్న తర్వాతనైనా.. రేవంత్?రెడ్డి భాషలో మార్పు రావాలని హితవు పలికారు. ఆయనకు ఇంగ్లీష్ రాదని.. హార్వర్డ్?లో ఏం నేర్చుకుంటారో చూడాలని ఎద్దేవా చేశారు. జనవరి 31 తర్వాత రేవంత్‌లో కొత్త మనిషి.. కొత్త భాష వస్తుందేమో చూద్దామన్నారు కేటీఆర్.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660